క్లుప్తంగా

విద్యార్థులకు అవగాహన



రొద్దం కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పెనుకొండ/పెనుకొండ రూరల్/గుడిబండ/రొద్దం/ సోమందేపల్లి/అమరాపురం: పెనుకొండ, కియా పోలీసుస్టేషన్, రొద్దం కేజీబీవీ పాఠశాలలో, సోమందేపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలు, నేరాలు, ఆయుధాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. గుడిబండ, అమరాపురం మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల్లో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు.

ప్రభాస్ అభిమానుల రక్తదానం



ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేస్తున్న ప్రభాస్ అభిమానులు

హిందూపురం టౌన్: యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఎస్‌వీ థియేటర్ వద్ద ప్రత్యేకమైన షో ప్రదర్శన అనంతరం కేక్ కట్ చేశారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రభాస్ అభిమానులు రక్తదానం చేసి తమ సేవాగుణాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రభాస్ అభిమానులు నవీన్, లక్ష్మణ్, సాయి, మంజునాథ్, రాకేష్ రెడ్డి, తేజ, లేపాక్షి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో బుధవారం ఆర్డీటీ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ లీలావతి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అగళి: మండల పరిధిలోని అగళి, ఆర్‌జీ హళ్లి, మధూడి, నరసబుంది, రామనపల్లి, కసాపురం గ్రామంలో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు భూమి పూజ చేశారు.



రాష్ట్రంలోనే వక్క ఉత్పత్తికి మడకశిర ప్రసిద్ధి. నియోజకవర్గంలో దాదాపు 5 వేల ఎకరాల విస్తీర్ణంలో వక్క తోటలు ఉన్నాయి. 10 వేల మంది రైతులు వక్క తోటలపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతి ఏడాది దాదాపు రూ.50 కోట్ల విలువ చేసే వక్క ఉత్పత్తి జరుగుతుంది. అయితే స్థానికంగా వక్క రైతులకు మార్కెట్ సౌకర్యం లేక కర్ణాటకకు తరలించాల్సిన దుస్థితి నెలకొంది. అక్కడ దళారుల బారిన పడి నష్టపోతున్నారు.



జిల్లాలోనే పట్టుగూళ్ల ఉత్పతిలో మడకశిర నియోజకవర్గం మొదటి స్థానంలో ఉంది. నియోజకవర్గవ్యాప్తంగా 10 వేల మంది పట్టు రైతులు ఉన్నారు. 14 వేల ఎకరాల విస్తీర్ణంలో మల్బరీ తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రతి ఏటా దాదాపు రూ.25 కోట్ల విలువ చేసే పట్టుగూళ్ల ఉత్పత్తి మడకశిర నియోజకవర్గంలో ఉంటుంది. హిందూపురం మార్కెట్‌కు వెళ్లే పట్టుగూళ్లలో 60శాతం మడకశిర ప్రాంతానికి చెందినదే. ఇంత పెద్ద స్థాయిలో పట్టుగూళ్ల ఉత్పత్తి జరిగే మడకశిర నియోజకవర్గంలో పట్టుగూళ్ల మార్కెట్ లేకపోవడం పట్టు రైతుల పాలిటశాపంగా మారింది.



నియోజకవర్గంలో దాదాపు 70 శాతం మంది రైతులు చింతచెట్లను పెంచి ఫలసాయం ద్వారా ఆర్థిక లబ్ధి పొందుతున్నారు. ప్రతి ఏటా దాదాపు రూ.15 కోట్ల విలువ చేసే చింతపండు ఉత్పత్తి అవుతోంది. అయితే మార్కెట్ సౌకర్యం లేక పోవడంతో రైతులకు ఇబ్బందికరంగా మారింది. హిందూపురం మార్కెట్‌కు చింతపండు తీసుకెళ్లి అమ్ముకోవాల్సిన పరిస్థితి.

వ్యవసాయోత్పత్తులు ఫుల్ .. మార్కెట్ సౌకర్యం నిల్ !



- మడకశిరలో నిరుపయోగంగా మార్కెట్‌యార్డు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- దళారులబారిన పడుతున్న రైతులు

మడకశిర: జిల్లాలోనే కొన్ని వ్యవసాయోత్పత్తుల్లో మడకశిర నియోజకవర్గం ఎప్పుడూ నంబర్ వన్‌గా ఉంటుంది. ప్రధానంగా వక్క, పట్టుగూళ్లు, చింతపండు, క్రాస్ బీడ్ పత్తి ఉత్పత్తిలో మడకశిర నియోజకవర్గంలోని రైతులు మొదటి స్థానంలో ఉన్నారు. ఈ పంటలపైనే రైతుల ఆర్థిక స్థితిగతులు కూడా ఆధారపడి ఉంటాయి. అయితే స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడం రైతులకు శాపంగా మారింది. దీంతో రైతులు దళారులబారిన పడి నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మార్కెట్ సౌకర్యం కరువు

జిల్లాలోనే అత్యధికంగా పండించే వాణిజ్య పంటలకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేదు. దీంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వక్కకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేక కర్ణాటకకు తరలించి అమ్ముకోవాల్సిన పరిస్థితి. అక్కడ దళారుల బెడద అధికంగా ఉంటుంది. ఇక పట్టుగూళ్లకు కూడా స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేదు. హిందూపురం, కర్ణాటకలోని రామనగర్‌కు తరలించి పట్టుగూళ్లను అమ్ముకుంటున్నారు. క్రాస్ పత్తిని అమ్ముకోవాలంటే కర్ణాటకకు వెళ్లాల్సిందే. చింతపండు అత్యధికంగా పండిస్తున్నా మడకశిరలో మార్కెట్ సౌకర్యం లేక రైతులు హిందూపురం తరలించాల్సిన పరిస్థితి దాపురించింది.

నిరుపయోగంగా మార్కెట్‌యార్డు

మడకశిరలో రైతులకు సేవలందాల్సిన వ్యవసాయ మార్కెట్ యార్డు దిష్టిబొమ్మలా దర్శనం ఇస్తోంది. ఈ మార్కెట్ యార్డు కర్ణాటక-ఏపీ సరిహద్దులో ఉంది. మార్కెట్ యార్డు అభివృద్ధి కావాల్సిన వనరులన్నీ ఉన్నా కూటమి ప్రభుత్వం మార్కెట్‌యార్డు అభివృద్ధిని గాలికొదిలేసింది. షెడ్లు, గదులు నిరుపయోగంగా ఉన్నాయి. లావాదేవీలు నిర్వహించడానికి వీలుగా స్థానిక ప్రజా ప్రతినిధులు ఇంతవరకు సమీక్ష కూడా చేయలేదు. పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడానికి కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం లేక రైతులు నానా తంటాలు పడుతున్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



రైతులు తమ వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మడకశిర మార్కెట్ యార్డులో లావాదేవీలను ప్రారంభించాలి. స్థానికంగానే రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలి. లేకపోతే రైతులు దళారుల బారిన పడి నష్టపోవడం ఖాయం. వెంటనే ప్రభుత్వం మార్కెట్ యార్డును ఉపయోగంలోకి తీసుకునిరావాలి.

– చంద్రప్ప, రైతు, మధూడి

కర్ణాటకలో అమ్ముకుంటున్నాం



స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేక మా పంటలను కర్ణాటకలో అమ్ముకుంటున్నాం. ప్రధానంగా వక్కకు మార్కెట్ సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. దూర ప్రాంతాలకు వక్కను తీసుకెళ్లి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం జాప్యం చేయకుండా వక్క మార్కెట్‌ను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలి.

–రవికుమార్, రైతు, బీజీ హళ్లి

ఇది చేతకాని ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైంది. ఇంత వరకు రైతులకు ప్రభుత్వం నుంచి పైసా సాయం అందలేదు. రైతుల పంటలకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించడం కూడా ప్రభుత్వానికి చేత కావడం లేదు. ప్రధానంగా వక్క, చింతపండు, పట్టుగూళ్లు, క్రాస్ పత్తి తదితర పంటలకు ప్రభుత్వం స్థానికంగానే మార్కెట్ సౌకర్యం కల్పించాలి. లేకపోతే రైతుల పక్షాన నిలబడి ఆందోళన చేస్తాం.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

కూటమి ప్రభుత్వం చేసింది శూన్యం

రొళ్ల: 'రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాలుగు నెలల కాలంలో పాలనలో ప్రజలకు చేసింది ఏమీలేదు. కేవలం సమయమంతా కూడా కక్ష సాధింపులచే సరిపోయింది' అని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి విమర్శించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి వీఓ లీడర్లు, యానిమేటర్లు, ఎఫ్‌పీ షాపుల డీలర్లను తదితరులను నిర్దాక్షిణ్యంగా తొలగించడం సరికాదన్నారు. హనిసేకుంట గ్రామంలో ఓ దుకాణాన్ని అన్నదమ్ముల వ్యక్తిగత భూ తగాదాల కారణాల వల్ల తొలగించుకొంటే ఆ సంఘటనను వైఎస్సార్‌సీపీపై రుద్దడం మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని సూచించారు.

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం



జ్యోతులు మోస్తున్న మహిళలు

హిందూపురం: మండల పరిధిలోని కొట్నూరులో వాల్మీకి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులను ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి వాల్మీకి విగ్రహం వద్ద జ్యోతులు సమర్పించారు. మంగళ హారతులిచ్చి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయొద్దు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

పెనుకొండ: బహిరంగ ప్రదేశాల్లో చికెన్ వ్యర్థాలను పారవేయకూడదని నగర పంచాయితీ కమిషనర్ శ్రీనివాసులు చికెన్ వ్యాపారులను హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని కమీషనర్ కార్యాలయంలో చికెన్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు.

పోలీసు భద్రత మధ్య మండల మీట్



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి

చిలమత్తూరు: కక్షలు, కార్పణ్యాలు వీడి మండల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి టీడీపీ నేతలకు హితవు పలికారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. గతంలో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పోలీసులు మండల కాంప్లెక్స్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అనుమతి ఉన్న వారిని మాత్రమే మండల కాంప్లెక్స్‌లోనికి అనుమతి ఇచ్చారు. టీడీపీ నేతలు ఎవరూ అటువైపు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ భారీ వర్షాలకు చెరువులకు నీరు చేరుతోందని, కుషావతి కట్టకాలువ లాలేపల్లి వద్ద తెగిపోవడంతో నీరంతా వృథాగా నదిలోనికి వెళ్తోందన్నారు. ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ, పోలీసులు కట్టకాలువ గండి పూడ్చాలని కోరారు. ఇదిలా ఉండగా ఎంపీపీకి అండగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ కార్యాలయానికి తరలి వచ్చారు. వేణురెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా గెలిచిన తమ పార్టీ ప్రజా ప్రతినిధులను టీడీపీ నాయకులు బెదిరింపులకు గురిచేయడం సరికాదన్నారు. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని గుర్తించాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ అభిషేక్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. భూముల ఫ్రీ హోల్డ్ రికార్డుల పరిశీలన, స్పందన అర్జీలను సంబంధించి వివరాలను ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు.

పెనుకొండ రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఫ్రీ హోల్డ్ రైట్స్,రీ సర్వే, తుపాను ప్రభావిత ప్రాంతాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

పార్టీలకతీతంగా మేలు చేయండి



సెరికల్చర్ అధికారిని నిలదీస్తున్న కోడిపల్లి సర్పంచ్

లేపాక్షి: రాజకీయ పార్టీలను చూడకుండా రైతులకు మేలు చేసే పనులు చేయాలని కోడిపల్లి సర్పంచ్ మంజునాథ్ అధికారులపై మండిపడ్డారు. బుధవారం లేపాక్షిలోని వెలుగు కార్యాలయంలో ఎంపీపీ జి.వెంటరత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సిరికల్చర్ అధికారి చంద్రమోహన్ సెరికల్చర్‌శాఖకు సంబంధించిన అంశాలపై మాట్లాడుతుండగా సర్పంచ్ స్పందించారు. కోడిపల్లిలో తాము చెప్పిన వారికి, తమ పార్టీ వారికే మల్బరీ షెడ్లు మంజూరు చేయాలని టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలను అధికారులను బెదిరిస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామంలో షెడ్లు నిర్మిస్తే బిల్లులు ఇవ్వమంటున్నారని, మరి గతంలో గ్రామంలో షెడ్లు నిర్మించిన రైతులకు ఎలా బిల్లులు చేశారని ప్రశ్నించారు. దీనిపై చంద్రమోహన్ స్పందించి రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులకు పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

వానొచ్చె.. వరదొచ్చె



చిలమత్తూరు: పరగోడు డ్యాం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది

సాక్షిబృందం: మడకశిర నియోజకవర్గంలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మంగళవారం రాత్రి 5 మండలాల పరిధిలో వర్షాలు కురిశాయి. అమరాపురంలో 58.6 మి.మీ , మడకశిరలో 48.6, అగళిలో 26.8, గుడిబండ, రొళ్ల మండలాల్లో 3.2 మి.మీటర్ల చొప్పున వర్షం పడినట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షాలకు పలు చెరువులకు జలకళ వచ్చింది. ఇదిలా ఉండగా పలు పంటలు దెబ్బతినడంతో వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. మరోవైపు చిలమత్తూరు మండలంలో చిత్రావతి, కుషావతి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పావగడ తాలూకాలో వళ్లూరు చెరువుకు గండి పడగా.. నాగలమడక గ్రామంలోని ఉత్తర పినాకి జలకళను సంతరించుకుంది.



చిలమత్తూరు మండలం మరవకొత్తపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుషావతి నది



అమరాపురం మండలం హేమావతిలో నీట మునిగిన పత్తి పంట



రొళ్ల మండలం రత్నగిరిలో సిద్ధగంగమ్మకు చెందిన పంట పొలంలోనే తడిసిన వేరుశనగ



మడకశిర: కుళ్లిపోతున్న వేరుశనగ కట్టెలో కాయలను తొలగించుకుంటున్న దృశ్యం



మడకశిర చెరువులోకి చేరిన వర్షపు నీరు



పావగడ తాలూకా వళ్లూరు చెరువుకు గండి పడటంతో రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



అగళి మండలం మధూడి వద్ద జలకళ సంతరించుకున్న సువర్ణముఖి నది



రొళ్ల పరిధిలోని జాతీయ రహదారిపై ఉదయం 9 గంటలవుతున్నా కప్పకున్న మంచు



అగళి: మరువ పారుతున్న ఆలూడి చెరువు

సంక్షిప్త సమాచారం

జర్నలిస్ట్ కాలనీకి మంచి నీటి సౌకర్యం

పెనుకొండ: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో పంచాయతీ అధికారులు బుధవారం పైప్‌లైన్ పనులు ప్రారంభించారు. తాగునీటి ఇబ్బందిని జర్నలిస్టులు, స్థానికులు మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె అధికారులను ఆదేశించడంతో పనులను మొదలు పెట్టారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి విరాళం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలో నిర్మిస్తున్న ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి లేపాక్షికి చెందిన మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్ రూ.50 వేలు విరాళాన్ని కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను కమిటీ సభ్యులు సత్కరించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

మడకశిర: పట్టణంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన అశ్వత్థప్ప (55) తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంలో కూరగాయలు పెట్టుకొని పెనుకొండ రోడ్డు దాటుతుండగా పాల ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీ కొన్నట్లు స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అశ్వత్థప్పను తుమకూరుకు తరలించారు.

పాఠశాలకు రూ.లక్ష విరాళం

రొద్దం: మండల పరిధిలోని ఎంజేపీ గురుకుల బాలుర పాఠశాలకు మండల టీడీపీ నాయకులు రూ.లక్ష విరాళం అందించారు. ఈమేరకు బుధవారం ప్రిన్సిపాల్‌కు నగదు ఇచ్చారు.

నష్టపరిహారం చెల్లించాలి

చిలమత్తూరు: ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలకు పంట నష్టపరిహారం చెల్లించాలని ఏఓ వంశీకి సీపీఎం నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ప్రవీణ్, రామచంద్ర, నరసింహ తదతరులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.2.46 లక్షల ఆదాయం

అమరాపురం: మండల పరిధిలోని నిద్రగట్ట గ్రామంలోని చెరువులో చేప పిల్లలను వదిలేందుకు గ్రామ సచివాలయంలో బుధవారం వేలం పాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన నవీన్ కుమార్ రూ.2.46 లక్షలకు చెరువును దక్కించుకున్నాడు. ఈఓఆర్డీ నాగముని, కార్యదర్శి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. అయితే పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. విద్యుత్, రెవెన్యూ సమస్యలు ఉన్న నేపథ్యంలో సంబంధితశాఖ అధికారులు రాక పోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మీనరసమ్మను సభ్యులు ప్రశ్నించారు. గంటలోపే సమావేశం మొక్కుబడిగా ముగించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పెనుకొండ: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆటో స్టాండ్, 44వ జాతీయ రహదారి సమీపంలో బుధవారం ఆయన ఆటో యజమానులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

రీసర్వేపై గ్రామ సభ

లేపాక్షి: మండలంలోని మైదుగోళం గ్రామం రచ్చ కట్ట వద్ద బుధవారం భూముల రీసర్వేపై గ్రామసభను నిర్వహించారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి జాయింట్ పట్టాల్లో లోపాలు ఉంటే వాటిని ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు.

ఇన్సెంటివ్ పేపర్లు పూరించి తీసుకురండి

హిందూపురం: రైతులు బైవోల్టీన్ గూళ్లు తీసుకొచ్చే సమయంలో ఇన్సెంటివ్ పేపర్లు పూరించి తీసుకురావాలని హిందూపూర్ పట్టుగూళ్ల మార్కెట్ అధికారి లక్ష్మీరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చాలామంది రైతులు తీసుకువచ్చే ఇన్సెంటివ్ పేపర్లు ఖాళీగా ఉంటున్నాయన్నారు. ఫీల్డ్‌లో పనిచేసే ఉద్యోగులు బాధ్యతగా ఇన్సెంటివ్ పేపర్లు పూరించి పంపాలన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు చర్యలు

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులు విద్య ప్రమాణాలు మెరుగు కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలతో ప్రత్యేకంగా సమావేశమై డిజిటల్ విద్య విధానం పై సమీక్షా సమావేశం నిర్వహించారు.

శిరా బస్సును హిందూపురానికి నడపాలి

మడకశిర: ఆర్టీసీ అధికారులు ఇటీవలనే ప్రారంభించిన శిర ఆర్టీసీ బస్సును హిందూపురం వరకూ నడపాలని అగళి, రొళ్ల మండలాలకు చెందిన ప్రజలు బుధవారం ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. హిందూపురానికి నడిపితే మార్కెట్‌కు వెళ్లే రైతులు, విద్యార్థులు, ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుందన్నారు.

కాంగ్రెస్ గూటికి జేడీఎస్ నేత

పావగడ: స్థానిక సీనియర్ జేడీఎస్ నేత కేఆర్ సురేశ్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ సమక్షంలో బుధవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. నవంబర్‌లో జరిగే జిల్లా పాల ఉత్పత్తి సహకార సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపుకు కృషిచేస్తానని సురేష్ తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

పెనుకొండ రూరల్: మత్తు పదార్థాలకు, గొడవలకు దూరంగా ఉండాలని కియా ఎస్ఐ రాజేష్ సూచించారు. బుధవారం మండలంలోని మక్కాజిపల్లి రైల్వేస్టేషన్ వద్ద నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులతో సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు.